ఆకస్మిక తనిఖీలు.. సిబ్బందికి సూచనలు



కలెక్టర్ వల్లూరి క్రాంతిని సన్మానిస్తున్న ఐటీఐ సిబ్బంది

హత్నూర, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి శనివారం హత్నూర మండలంలో ఆకస్మిక పర్యటన చేశారు. ముందుగా గురుకుల వసతి గృహం పరిశీలించి భోజనం నాణ్యతపై ఆరా తీశారు. మెనూ ప్రకారం పెట్టాలని సిబ్బందికి సూచించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి వివరించారు. పీహెచ్‌సీకి వెళ్లి రోగులను పలకరించి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలించి భూ సమస్యల పరిష్కారంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఐటీఐ పరిశీలించి వృత్తివిద్యా కోర్సులు చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో కలిసి ఐటీఐ ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మి కలెక్టర్‌ను సత్కరించారు. ఆమె వెంట తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉజ్వల భవిత

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఏటీసీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రవేశాలు వంద శాతం నమోదు కావడంపై సిబ్బందిని అభినందించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రవీందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ సైనికులకు అన్నీ ఉచితమే!

ఈ చిత్రం చూడగానే.. ఇదేదో సాధారణ హోటలే కదా.. ఏముంది విశేషం అనిస్తుంది కదూ! దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందే. ఇక్కడికి సైనికులెవరైనా వస్తే అన్నింటినీ ఉచితంగా అందించడమే ఆ ప్రత్యేకత.



న్యూస్‌టుడే, కోహీర్

కని పెంచిన తల్లిదండ్రులకు, ఉన్న ఊరికి దూరంగా.. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి కాపలా కాస్తూ మనల్ని రక్షిస్తుంటారు సైనికులు. వారి సాహసం, త్యాగం వెలకట్టలేనివి. ఎక్కడైనా కనిపిస్తే మన మనసు ఉప్పొంగుతుంది. వారికి సెల్యూట్ చేస్తుంటాం. దేశానికి ఇంతగా చేస్తున్న సైన్యం అంటే ఆ కుటుంబానికి ప్రాణం. తమ ఫలహారశాలలో సైనికులకు అన్నింటినీ ఉచితంగా అందిస్తుండటం విశేషం. వారే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ సమీపంలోని హోటల్ నిర్వాహకులు సానం వాసుదేవ్ కుటుంబసభ్యులు.



వాసుదేవ్‌తో వైమానిక దళం సిబ్బంది

చిన్నతనంలోనే..

ఇదే జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లికి చెందిన సానం జగన్నాథం, శాంతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు వాసుదేవ్, గోవింద్, వెంకటేశం, కుమార్తె పార్వతమ్మ ఉన్నారు. జగన్నాథం కోహీర్ మండలం కొత్తూర్(డి) సమీపంలో 9వ నంబరు జాతీయ రహదారి (ప్రస్తుత ఎన్‌హెచ్ 65)లో టీ హోటల్ నడిపేవారు. పెద్ద కుమారుడు వాసుదేవ్ 1986లో ఏడో తరగతి పాసయ్యాడు. అప్పట్లో తనకిష్టమైన ఆర్మీ జవాను ఉద్యోగానికి ఎంపిక య్యారు. దీనికి ఇష్టపడని అతడి తల్లిదండ్రులు వాంగ్మూల పత్రంపై సంతకం చేయలేదు. వాసుదేవ్ నిర్ణయం మార్చుకొని పదేళ్లు హైదరాబాద్ సమీపంలో పండ్ల వ్యాపారం చేశారు. ఆ తర్వాత పలు కారణాలతో తిరిగొచ్చేసి హోటల్ నడిపిస్తున్నారు.

కుమారుడినైనా..

వాసుదేవ్‌కు వెంకటమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. ముగ్గురు కుమార్తెలు. కుమారుల్లో ఒకరు ఆర్మీలో చేరాలని వాసుదేవ్ ఆశించారు. పెద్ద కుమారుడు నారాయణ సరిపడా ఎత్తు లేక విఫలమయ్యారు.

ప్రత్యేకంగా స్వాగతం



వాసుదేవ్ కుమారుడిని సన్మానిస్తున్న కోదండరాం

8 ఏళ్ల కిందట వాసుదేవ్ తన హోటల్‌ను దిగ్వాల్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కకు మార్చారు. 65వ నంబరు జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. తమ హోటల్‌కు వచ్చే సైనికులకు ఆహారం ఉచితంగా అందించాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు సైనికుల వాహనాలు వెళ్తూ తమ హోటల్ దగ్గర ఆగగానే ప్రత్యేకంగా స్వాగతం పలుకుతారు. జవాన్లు తీసుకునే అల్పాహారానికి, ఛాయ్, ఇతర వస్తువులకు ఎలాంటి డబ్బు తీసుకోకుండా ఉచితంగా ఇచ్చేస్తారు వాసుదేవ్. వీరి సేవలను గుర్తించిన ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం 2019లో సత్కరించారు.

నిజమైన హీరోలు వారే..: వాసుదేవ్

తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న సైన్యమే నిజమైన హీరోలు. నా జీవిత లక్ష్యం నెరవేరకున్నా ఆర్మీ జవాన్లకు నా వంతుగా సేవ చేస్తున్నా. నేటి యువత దృఢంగా ఉండి మాతృభూమి సేవలో మమేకమవ్వాలన్నదే నా అభిప్రాయం.

షరతులు లేకుండా రుణమాఫీ చేయండి



కోదండరెడ్డితో శ్రీహరిరావు, రాఘవేంద్రరెడ్డి

సంగారెడ్డి అర్బన్, నారాయణఖేడ్: షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు, జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డికి విన్నవించారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి పలు సమస్యలు ప్రస్తావించారు.

* బాధ్యతలు స్వీకరించిన కోదండరెడ్డిని జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నవంబరు రెండో వారంలో ఇన్‌స్పైర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: నవంబరు రెండో వారంలో ఇన్‌స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో జిల్లా నుంచి 93 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి ఫోన్ నంబరులో (63022 90235) సంప్రదించాలని సూచించారు.

కేసుల పరిష్కారానికి చర్యలు



ఖైదీల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఖైదీలు ఎదుర్కొంటున్న కేసులు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ అన్నారు. శనివారం కందిలోని కేంద్ర కారాగారాన్ని తనిఖీ చేశారు. న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఖైదీలకు సంబంధించిన కేసులు, ఇతరత్రా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం జైలులోని అన్ని బ్యారక్‌లు కలియతిరిగారు. పురుష, మహిళా ఖైదీలతో వేర్వేరుగా మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. భోజనశాల, ఫిర్యాదుల బాక్సులు, శౌచాలయాలను పరిశీలించారు. ఆయన వెంట జైలు అధికారులు ఉన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే హైడ్రా: సీపీఎం



జహీరాబాద్‌లో సీపీఎం నాయకుల ర్యాలీ

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: పాలనపై నెలకొన్న అసంతృప్తి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం హైడ్రా పేరుతో హైడ్రామాలు ప్రారంభించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్కా రాములు ఆరోపించారు. జహీరాబాద్‌లో శనివారం నిర్వహించిన మూడో జిల్లా మహాసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సంపూర్ణంగా రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా ఇవ్వలేదని ఆరోపించారు.



మాట్లాడుతున్న వీరయ్య

అఖిల పక్షంతో చర్చించిన తర్వాతే మూసీ ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాల్లో సరైన ప్రణాళిక అమలు చేయకపోవడంతో నిరుద్యోగ యువత రోడ్డెక్కి నిరసనలు చేయాల్సి వస్తోందన్నారు. జహీరాబాద్ నిమ్జ్ భూమి కోల్పోతున్న నిర్వాసితులకు సరైన పరిహారం సహా పునరావాసం కల్పించాలన్నారు. జిల్లా మీదుగా పారుతున్న మంజీర నది జలాలను సాగునీటికి అందించాలన్నారు.

కదం తొక్కిన కామ్రేడ్లు..

జిల్లా మహాసభ ప్రారంభం సందర్భంగా పట్టణంలోని సీపీఎం నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శనలతో కదం తొక్కారు. స్థానిక సుభాష్‌గంజ్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు డప్పు కళాకారులు, ఎర్ర జెండాలతో నాయకులు ఆడిపాడారు. ర్యాలీ కొనసాగించారు. సభ ప్రాంగణంలో పార్టీ జెండా ఆవిష్కరించి సీతారాం ఏచూరి సహా ఇతర నాయకుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, మల్లారెడ్డి, మల్లేశం, జయరాజు, సభ్యులు మల్లేశం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులకు దిగులుండదిక



వినియోగంలోకి రానున్న వృద్ధాశ్రమం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: ఒకప్పుడు కుటుంబ వ్యవస్థలో పెద్దల మాటే శిరోధార్యం. వారికి సేవలు చేయడం, గౌరవించడం విధ్యుక్త ధర్మాలుగా భావించే సంస్కృతి. సంపాదన మొత్తాన్ని కుటుంబ పెద్ద చేతిలోనే పెట్టేవారు. కుటుంబ పెద్ద ఏ నిర్ణయం తీసుకున్నా తమ ఉన్నతికేనని కట్టుబడి ఉండే సంస్కృతిలో క్రమంగా మార్పులు వచ్చాయి. సమాజంలో ప్రస్తుతం వయోవృద్ధుల్లో ఎక్కువ మంది నిరాదరణకు గురవుతున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి వారి ఇబ్బందులు దూరం చేయాలన్న లక్ష్యంతో వృద్ధాశ్రమాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే జిల్లాకు రెండేళ్ల కిందట మంజూరు చేసింది. నిధుల లేమితో పనులు మధ్యలో ఆగిపోగా తాజాగా నిధులు విడుదల కావడంతో పనులు మళ్లీ మొదలయ్యాయి.

జిల్లా జనాభా	15.27 లక్షలు
వృద్ధాప్య పింఛను పొందుతున్న వారు:	60,454

రాష్ట్ర వ్యాప్తంగా మూడు: సంగారెడ్డి, సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం రెండేళ్ల కిందట నిర్ణయించింది. ఈమేరకు మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి వీటి పనులు ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించింది. ప్రభుత్వం మూడు వృద్ధాశ్రమాల ఒక్కోదానికి రూ.50లక్షలు చొప్పున కేటాయించింది. వృద్ధాశ్రమ నిర్మాణాలు రెడ్‌క్రాస్ సొసైటీ చూడనుంది.

మహిళా ప్రాంగణంలో నిర్మాణం: జిల్లాకు మంజూరైన వృద్ధాశ్రమ నిర్మాణానికి మహిళా ప్రాంగణం ఆవరణ ఎంపిక చేశారు. రూ.50లక్షలతో రెండేళ్ల కిందట పనులు చేపట్టారు. నిధుల లేక మధ్యలోనే ఆగిపోయాయి. వసతుల కల్పన, తదితరాలకు మరిన్ని నిధులు అవసరమై మిగతా పనులు ఏడాదిగా ముందుకు సాగలేదు. దీంతో ఏ ఆసరా లేనివారు రహదారుల పక్కన కాలం వెళ్లదీస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రూ.40 లక్షలు విడుదల చేయడంతో వృద్ధాశ్రమ నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు. వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం : లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి



అదనపు నిధులు మంజూరు కావడంతో పనులు మొదలయ్యాయి. త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆ ప్రకారం ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వం తీసుకువచ్చిన వయోవృద్ధ సంరక్షణ చట్టాలు అమలయ్యేలా చూస్తాం.

పారిశ్రామిక రంగంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మాదిగలు పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి అన్నారు. శనివారం సంగారెడ్డిలోని జడ్పీ పాత సమావేశ మందిరంలో మాదిగ ఇంటిగ్రేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ఇండస్ట్రీ (మిక్కి) సీహెచ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. కార్పొరేషన్ రుణాలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మిక్కి ప్రధాన కార్యదర్శి నర్సింహ, ప్రతినిధులు సత్యేంద్రకుమార్, సుధాకర్, మాధవి, శ్రీనివాస్, భాస్కర్, కోటేశ్వర్‌రావు, సతీష్, ఇమ్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు ఆపాలని నిరసన



సదాశివపేటలో హిందూ సంఘాల ప్రతినిధుల ర్యాలీ

సంగారెడ్డి అర్బన్, సదాశివపేట: న్యూస్‌టుడే: హైదరాబాద్, సదాశివపేట తదితర ప్రాంతాల్లో హిందూ దేవాలయాలపై దాడులకు నిరసనగా శనివారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. హిందూ సంఘాల ప్రతినిధులు ధర్మ ప్రసాద్, సుభాష్‌చందర్, పవన్ గౌడ్, ప్రకాశ్, ప్రభు కుమార్ గౌడ్ పాల్గొన్నారు. సదాశివపేటలో వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బందులో పాల్గొన్నాయి. హిందూ సంఘాల ప్రతినిధులు పేటలోని హనుమాన్ మందిరం ర్యాలీ చేపట్టారు. అనంతరం స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు.

రైతు భరోసా ఎప్పుడిస్తారు: ఎమ్మెల్యే

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: రైతు భరోసా ఇంకెప్పుడు ఇస్తారని స్థానిక ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలంటూ ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు తెలుపుతామన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయం తనిఖీ

జోగిపేట: జోగిపేట సబ్ రిజిస్ట్రార్, వివాహ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ సుబ్బలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. రోజువారీగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య, ఇతర వివరాలు తెలుసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ అబీబ్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లో కాలుష్య జలాలు



డిడ్గి శివారులో..

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ మండలం డిడ్గి శివారులో కాలుష్య జలాలు పారబోతపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతంలోని చెక్ డ్యామ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట ట్యాంకర్లలో తీసుకొచ్చి దుర్వాసన వెదజల్లే కాలుష్య జలాలు పారబోసి వెళ్లినట్లు చెబుతున్నారు. తాగు నీటి కోసం వెళ్లిన మూగజీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయని, సంబంధిత అధికారులు నమూనాలు సేకరించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విగ్రహాన్ని ధ్వంసం చేయలేదు: డీఎస్పీ



మాట్లాడుతున్న సత్యయ్యగౌడ్

సదాశివపేట, న్యూస్‌టుడే: గుడిలోని విగ్రహాన్ని ఎవరూ ధ్వంసం చేయలేదని సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్ తెలిపారు. శనివారం స్థానిక ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా 15వ తేదీ అర్ధరాత్రి నుంచి 16వ తేదీ తెల్లవారుజామున 4 గంటల వరకు ఎలాంటి సంఘటన జరగలేదన్నారు. వర్షం కురవడంతో పశువులు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించాయని, 8 గంటల సమయంలో ఒక భక్తుడు వచ్చి వాటిని బయటకు పంపించాడన్నారు. అనంతరం భక్తుడు ప్రదక్షిణ చేసి బయట నుంచి దర్శనం చేసుకుంటుండగా గర్భగుడిలో మరో పశువు ఉండటం గమనించి దాని బయటకు పంపించారు. ఆ తర్వాత వచ్చిన భక్తులు విగ్రహాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పశువు గర్భగుడిలోకి ప్రవేశించడం వల్ల విగ్రహం దెబ్బతిందని తేలిందన్నారు. సీఐ మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రణాళికతోనే శతశాతం ఫలితాలు



డీఈవోను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు


జిన్నారం, న్యూస్‌టుడే: పదో తరగతిలో శతశాతం ఫలితాల నమోదుకు అన్ని పాఠశాలలు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం జిన్నారం మండలం కొడకంచి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫలితాల నమోదులో తల్లిదండ్రుల పాత్ర కీలకమేనని అన్నారు. చిన్నారులను టీవీలు, చరవాణులకు దూరంగా ఉంచాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఎవరు వెనుకబడి ఉన్నారో గుర్తించి ప్రత్యేక చొరవతో ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రేమవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతుల్లేని గృహాలు

● పాడైన తలుపులు, కిటికీలు ● విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



పుల్కల్‌లో కూలిన ఎస్సీ వసతి గృహం ప్రహరీ



కల్హేర్‌లో తలుపు ఇలా..

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జహీరాబాద్, కోహీర్, కల్హేర్, రాయికోడ్, పుల్కల్: సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. పాడైన తలుపులు, కిటికీలు దర్శనమిస్తున్నాయి. వీటికి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల మరమ్మతులు చేస్తున్నా అసంపూర్తిగా వదిలేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు నిత్యం సమస్యలతో సహవాసం చేస్తున్నారు.

ఇబ్బందులివీ..

- పుల్కల్ ఎస్సీ వసతి గృహ ప్రహరీ కూలింది. మరమ్మతులకు రూ.14 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. పనులు ఇప్పటి వరకు ప్రారంభించలేదు.
- కోహీర్ పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం చుట్టూ ముళ్ల పొదలు పెరిగాయి. పాములు, ఇతర విష కీటకాలు లోనికి వస్తున్నాయి. బాలికలు రాత్రి సమయంలో భయాందోళనకు గురవుతున్నారు.
- జహీరాబాద్‌లోని సమీకృత బీసీ హాస్టల్ పాఠశాలకు దూరంగా ఉంది. విద్యార్థులు చేరేందుకు వెనకంజ వేస్తున్నారు. ఇక్కడ 400 మందికి 80 మంది వచ్చారు. రైలు పట్టాలు దాటి పాఠశాలకు వెళ్లే అవకాశం ఉండడంతో విద్యార్థులను చేర్పించడం లేదు.

జిల్లాలో వసతి గృహాలు, విద్యార్థుల సంఖ్య

రకం	సంఖ్య	విద్యార్థులు
సాంఘిక సంక్షేమం	48	4,200
గిరిజన	13	1300
బీసీ	35	3,200

- కల్హేర్ హాస్టల్‌లో 140 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ కిటికీలు, తలుపులు పాడయ్యాయి. వీరికి సరిపోయేన్ని ఫ్యాన్లు, కార్పెట్లు లేవు.
- రాయికోడ్ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు పాడయ్యాయి. దీంతో ఇక్కడి విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్తున్నారు. స్నానానికి వేడి నీళ్లు రావడం లేదు.
- సంగారెడ్డి, జిన్నారం ఎస్సీ హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయి. పాత భవనాలు కావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వీటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సిన అవసరం ఉంది.

మరమ్మతులు చేయిస్తాం

-అఖిలేష్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి

- జగదీశ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి

జిల్లాలో ఏఏ వసతిగృహాల్లో సమస్యలున్నాయో తెలుసుకుంటాం. అవసరమైన చోట మరమ్మతులు చేయిస్తాం. ఎక్కడైనా పాత భవనాలు ఉంటే కొత్త వాటికి ప్రతిపాదనలు పంపిస్తాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.



కోహీర్‌లో ఎస్సీ హాస్టల్ ముందు పెరిగిన ముళ్ల పొదలు

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం: డీఈఈ




పుల్కల్, న్యూస్‌టుడే: ‘ఈనాడు’లో ‘నిత్యం ఒక సంచి మట్టి.. దారి బాగుకు నడుం కట్టి’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. శనివారం సాయంత్రం డీఈఈ రవీందర్, ఏఈ శశాంక్, గుత్తేదారుతో కలిసి రోడ్డును పరిశీలించారు. సర్వేచేసి మార్కింగ్ కూడా పూర్తిచేశారు. ముద్దాయిపేట చౌరస్తా నుంచి పోచారం వరకు ఇప్పటికే 4 కి.మీ రోడ్డు మంజూరు ఉందని, వారం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని డీఈఈ పేర్కొన్నారు.

పోతిరెడ్డిపల్లి కూడలిపై పట్టింపేది!



చిన్నపాటి వర్షం కురిసినా సంగారెడ్డి పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లి కూడలి జలమయం అవుతోంది. పట్టణానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మురుగు కాల్వలు సక్రమంగా లేక వర్షం కురిసినప్పుడు ఒక్కసారిగా రహదారిపై వరద నీరు చేరి మోకాలు లోతులో నిలుస్తుంది. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. సమీపంలోని మురుగు కాల్వలు ఆక్రమణకు గురికావడం.. ఏళ్ల నాటి నాలాలు కుచించుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

'బలగం' నటి కొమురమ్మకు స్పీకర్ రూ.లక్ష ఆర్థిక సాయం



వికారాబాద్, న్యూస్‌టుడే: 'బలగం' సినిమాలో నటించిన కొమురమ్మకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తన వేతనం నుంచి రూ.లక్ష విరాళం హైదరాబాద్‌లోని అధికార నివాసంలో శనివారం అందించారు. దంపతులైన కొమురమ్మ, మొగిలయ్యలు ఇటీవల ఓ సభలో స్పీకర్‌ను కలిసి ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించారు. చలించిన ఆయన రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నారు.

క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు రేపు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ఉంటుందని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1, 2001 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో.. సాంకేతికత

న్యూస్‌టుడే, మెదక్

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికీ అత్యధికులకు వ్యవసాయమే జీవనాధారం. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో వరి ఎక్కువగా సాగవుతోంది. ఈ మేరకు ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగాలు సన్నద్ధమయ్యాయి. కోతలు షురూ కావడంతో కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రభుత్వం సన్న రకం సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా సన్నాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించుకోనుండటం విశేషం.

నాలుగు జిల్లాల్లో ఇలా..

జిల్లా	ధాన్యం దిగుబడి (లక్షల మె.ట.ల్లో..)	కొనుగోలు కేంద్రాలు
మెదక్	7.49	483
సంగారెడ్డి	3.18	211
సిద్దిపేట	9.0	417
వికారాబాద్	1.0	107

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో 8,99,369 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్నాల సాగే ఎక్కువగా ఉంది. కొందరు దొడ్డు రకం సైతం పండించారు. ఈ క్రమంలో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు. సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం 33 రకాలను సన్నాలుగా గుర్తించింది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆయా పరికరాల వినియోగంపై వివిధ జిల్లాల్లో వ్యవసాయ, సహకార, జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు.

వడ్లు ఒలిచేందుకు..



సన్నాలను గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరంలో వడ్లను ఒలిచి బియ్యాన్ని మాత్రమే వేయాల్సి ఉంటుంది. ఇందుకు కొంత శ్రమ అవసరం. సులభంగా వడ్లు ఒలిచేందుకు ప్యాడి హస్కర్ యంత్రాన్ని అందిస్తున్నారు. ఇందులోకి కొంత ధాన్యాన్ని వేసి తిప్పితే వడ్ల పొట్టు తొలగిపోయి బియ్యంగా మారుతాయి. వాటిలో నుంచి ఓ గింజను గ్రెయిన్ కాలిపర్‌లో వేసే సరిపోతుంది.

సన్నాలు గుర్తించేలా..



సన్న రకానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో వీటి సేకరణలో అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. నాణ్యతతో పాటు సన్న ధాన్యం గుర్తించేందుకు గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేంద్రానికి రెండు డిజిటల్ పరికరాల చొప్పున కేటాయిస్తున్నారు. ఈ యంత్రంలో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. నిర్దేశిత ప్రమాణాలు ఉంటేనే కొంటారు. సంచుల్లో ధాన్యాన్ని నింపాక సులువుగా గుర్తించేలా సన్నాలకు ఎరుపు, దొడ్డు రకానికి ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

ధ్రువీకరించాకే..:



సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. సన్నాలను కొత్త పరికరం ద్వారా గుర్తించి వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. దళారుల ప్రమేయం తగ్గించడానికి ఐరిస్ విధానం దోహదపడుతుంది. ఆయా వాటిపై అధికారులకు శిక్షణ ఇచ్చాం. పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. **హరికృష్ణ, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, మెదక్**

పక్కదారి పట్టకుండా..



రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయం సమయంలో మరో సారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్‌ను మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకొని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో ఐరిస్ వినియోగిస్తారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఆటల్లో గెలుపోటమలు సహజమని, వాటి ద్వారా మానసిక, శారీరక దృఢత్వం చేకూరుతుందని మెదక్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి (డీవైఎస్‌వో) దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియ ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్), సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ (ఎస్‌సీఎఫ్ఎ) సంయుక్తంగా చేపట్టిన ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలతో పాటు చదువుల్లో రాణిస్తే పలు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల నిర్వాహకులు విష్ణుతేజ మాట్లాడారు. అండర్-13, 15, 17 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు కొనసాగాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి మొత్తం 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఐకేఎఫ్ స్కౌట్ వినోద్‌కుమార్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగరాజు, శిక్షకులు ప్రకాశ్, భాగ్యమ్మ, ప్రశాంత్, వినయ్, ధను తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హాకీ జట్ల ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల హాకీ అండర్- 14, 17 ఎంపికలు కంది ఐఐటీహెచ్‌లోని డీఏవీ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొటారని పేర్కొన్నారు.

అన్నదాత ప్రాణాలు తీసిన ఇనుప కంచె



యాదయ్య

వెల్దుర్తి: అడవి పందుల నుంచి రక్షణకు పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్తు సరఫరా అవుతున్న ఇనుప తీగలకు తగిలి రైతు మృతిచెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని యశ్వంతరావుపేటకు చెందిన గుండెని యాదయ్య(46) పొలం అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉంది. అడవి పందుల బారి నుంచి రక్షణగా పొలం చుట్టూ ఇనుప కంచె బిగించాడు. శుక్రవారం రాత్రి యాదయ్య భోజనం చేసి పంట కాపలాకు పొలానికి వెళ్లాడు. కంచెకు విద్యుత్తు సరఫరా కల్పించి నిద్రించాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన చుట్టుపక్కల రైతులు గమనించగా.. ఇనుప కంచె తగిలి యాదయ్య మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శనివారం యాదయ్య భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాత



శ్రీనివాస్

నార్సింగి(చేగుంట): చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వల చుట్టుకొని నీట మునిగి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. నార్సింగి మండలం నర్సంపల్లికి చెందిన ఉడుత శ్రీనివాస్ (50) వ్యవసాయం చేస్తుంటాడు. స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వలలు వేశాడు. శనివారం ఉదయం వెళ్లగా వెళ్లి ప్రమాదవశాత్తు వల చిక్కుకొని నీట మునిగి మృతిచెందాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. శ్రీనివాస్‌కు భార్య, కుమార్తె, కుమారుడున్నారు. కేసు నమోదైంది.


ట్రాక్టర్ బోల్తా పడి మహిళ దుర్మరణం



సాయమ్మ

కౌడిపల్లి: ట్రాక్టర్ బోల్తాపడి మహిళ దుర్మరణం పాలైంది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధి భుజరంపేట పరిధి వెంకటాపూర్‌కు చెందిన బడిగంటి సాయమ్మ(54). . శనివారం ఇంటి నిర్మాణానికి కౌడిపల్లి నుంచి ట్రాక్టర్లో డస్ట్ తీసుకెళుతుండగా.. శివారులోని కూకుట్లపల్లి రోడ్డుపై మల్లు కుంట శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న సాయమ్మ డస్ట్‌లో కూరుకుపోయి చనిపోయింది. డ్రైవర్ యాదాగౌడ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వాహనం ఢీకొని వృద్ధుడు..



నారాయణ

మిరుదొడ్డి: వాహనం అదుపుతప్పి వృద్ధుడిని ఢీకొట్టడంతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా భూంపల్లి ఎస్సై హరీష్ తెలిపిన వివరాలు.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లికి చెందిన పర్స నారాయణ(66) రహదారి పై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి అదుపుతప్పి వెనుక నుంచి నారాయణను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి

జిన్నారం, న్యూస్‌టుడే: పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. ఐడీఏ బొల్లారం పోలీసులు, పరిశ్రమ వర్గాల తెలిపిన వివరాలు.. సెల్‌మార్ ల్యాబరేటరీ పరిశ్రమలో పదిలం రాజేశ్ (31) ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంటలకు మొదటి షిఫ్టులో విధులకు వచ్చిన ఆయన చిల్లింగ్ ప్లాంటు బ్రెయిన్ సంపులో పడి మృతి చెందాడు. ఆ సమయంలో ఎవరూ చూసి ఉండకపోవచ్చని చెబుతున్నారు. భద్రాచలం ప్రాంతంలోని కొత్తగూడెంకు చెందిన రాజేశ్ గత కొంతకాలంగా మేడ్చల్ జిల్లా సూరారంలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, చిన్న పాప ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఐడీఏ బొల్లారం సీఐ గంగాధర్ పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అనుమానాలు ఉన్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు.

నీతులు చెప్పాల్సిన నోటితో బూతులు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: పిల్లలకు నీతులు చెప్పాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఒకరు ఇటీవల బదిలీపై వచ్చారు. ఇక్కడ చేరినప్పటి నుంచి విద్యార్థులను మాటలతో హింసించడంతో పాటు మూత్రశాలలకు వెళ్లినా తిడుతున్నాడంటూ పలువురు తమ తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. బడికి రావాలంటే పిల్లలు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవో పుష్ప వేణిలకు ఫోన్‌లో విషయాన్ని వివరించారు. ఎంఈవో పాఠశాలకు వచ్చి వారితో మాట్లాడి ఆరా తీశారు. వాస్తవమని తేలడంతో మరోసారి ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్‌ఎంను హెచ్చరించారు. ఇకనుంచి ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఒత్తిడి లేకుండా విధులు నిర్వహిస్తేనే ఆరోగ్యం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా చూసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడాల శ్రీనివాస్ సూచించారు. అప్పుడే అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని తెలిపారు. ఒత్తిడి అధిగమించడంపై సిద్దిపేట కమిషనరేట్‌లో అధికారులు, సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కమిషనరేట్ ఏవో యాదమ్మ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, సీసీ ఆర్బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలను మరింత ప్రోత్సహించాలి



మంత్రి తుమ్మలను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి

ములుగు, న్యూస్‌టుడే: మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగు వైపు రైతులు ఆసక్తి చూపేలా కార్యక్రమాలు అమలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా నూతనంగా నియమితులైన దండా రాజిరెడ్డి శనివారం రాత్రి హైదరాబాదులో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వీసీతో పలు అంశాలపై చర్చించారు.

ప్రమాదానికి గురైన కారు.. పట్టుబడిన గంజాయి

80 కిలోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఎండు గంజాయి బస్తాలు పరిశీలిస్తున్న పోలీసులు

రామాయంపేట, న్యూస్‌టుడే: ప్రమాదానికి గురైన కారులో భారీగా గంజాయిని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న కారు జాతీయ రహదారిపై రామాయంపేట శివారులోకి రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న వారు కారును అక్కడే వదిలి పారిపోయారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు కారును గుర్తించి తనిఖీ చేయగా.. గంజాయి బస్తాలు బయటపడ్డాయి. ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి వచ్చి కారు డిక్కీలో ఉంచిన నాలుగు బస్తాల్లోని 80 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120-00	డ్రెస్డ్	206-00
రిటైల్	142-00	స్కిన్‌లెస్	234-00

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



లింగయ్య

గజ్వేల్ గ్రామీణ: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జగదేవపూర్ మండలం కొల్గుర్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. కొల్గుర్‌కు చెందిన బండారి లింగయ్య(55) గ్రామంలో పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం అతని భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపం చెంది.. జీవితంపై విరక్తితో శుక్రవారం అర్ధరాత్రి ఇంటి పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ మరొకరు..

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ఆర్అండ్ఆర్ కాలనీ వేములఘాట్‌కు చెందిన కంటి ప్రభాకర్(22) ఆటో నడుపుతు జీవనం సాగించేవాడు. జల్సాలకు అలవాటుపడి ఆరు నెలల క్రితం ఆటో అమ్మేశాడు. మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. చనిపోతున్నట్లు ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. వాట్సాప్ స్టేటస్ చూసిన కొందరు హుటాహుటిన ఇంటికి చేరుకొని గడియ పగలగొట్టి లోపలికి వెళ్లి కిందికి దించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ఆర్వీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ బావ బామ్మర్దులు మృతి

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో శుక్రవారం రాత్రి ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కూటిగల్ తండాకు చెందిన లావుడ్యా వాగ్యా(30), అతని బావ భూక్య రాజు(46) ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్‌లుగా బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్‌లో పనులు ముగించుకుని వాహనంలో ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ శివారులోని చేపలకాలనీ వద్ద పార్కింగ్ ఇండికేటర్స్ వేయకుండా, నిర్లక్ష్యంగా రోడ్డు మీద ఆపిన లారీని గమనించక వెనక నుంచి ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వాహనదారులు, పోలీసులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

లక్ష్మీపతిగూడెంలో పట్టపగలే చోరీ

జిన్నారం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని దుండగులు శనివారం పట్టపగలు లక్ష్మీపతిగూడెంకు చెందిన జనార్దన్ ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని నాలుగు తులాల బంగారం, ఆరు తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.40 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు వాపోయారు. జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీం ఆధారంగా విచారణ చేస్తున్నట్లు ఎస్సై నాగలక్ష్మి పేర్కొన్నారు.

'సైక్లింగ్'లో సిద్దిపేట జిల్లా క్రీడాకారుల సత్తా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా ఖేలో ఇండియా సైక్లింగ్ అకాడమీ క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-18 బాలికల విభాగంలో టైమ్ ట్రయల్ 500 మీటర్ల అంశంలో కె.హర్షిత (హుస్నాబాద్-ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) తృతీయ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో రిజ్వానా బేగమ్ (సిద్దిపేట-ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల) నాలుగో స్థానంలో నిలిచారని జిల్లా సైక్లింగ్ అకాడమీ శిక్షకుడు సంజీవ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌చార్జి అధికారి జయదేవ ఆర్య, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనర్సయ్య తదితరులు క్రీడాకారులను అభినందించారు.

గురుకులంలో కాగ్నిజెంట్ శిక్షణ శిబిరం



అవగాహన కల్పిస్తున్న కాగ్నిజెంట్ డిప్యూటీ జీఎం శ్రీనివాస్ కుప్ప

వర్గల్, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కాగ్నిజెంట్ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్ కుప్ప పేర్కొన్నారు. శనివారం వర్గల్ మహాత్మ జ్యోతి బాపులే బీసీ డిగ్రీ మహిళా గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈనెల 23న తృతీయ సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు గచ్చిబౌలి కాగ్నిజెంట్ సంస్థను సందర్శించి అక్కడి నిర్వాహకులతో నైపుణ్య శిక్షణ పొందనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ గోవిందరావు, సంస్థ ప్రతినిధులు, విద్యాలయం ప్లేస్‌మెంట్ నిర్వాహకులు రాధ, నిఖిత పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి



సత్యనారాయణ స్వామి వ్రతపూజలో భక్తులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం చాకరిమెట్లలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన చేపట్టారు. సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో సామూహిక వ్రతాలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్, ప్రధాన పూజారి దేవదత్త శర్మ తదితరులున్నారు.

ఉపాధితోనే వలసల నివారణ

న్యూస్‌టుడే, నారాయణఖేడ్



తల్లిదండ్రుల వెంట చిన్నారులు

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతం. ఇక్కడ 188 వరకు తండాలు ఉండగా, 50 వేలకు పైగా గిరిజనులు నివసిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా పరిశ్రమలు లేకపోవడం గమనార్హం. దీంతో యువత, ఇతర వర్గాల వారికి సరైన ఉపాధి దొరక్క వేరే ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఇక చెరకు నరికే సీజన్ వచ్చిందంటే చాలు.. ఈ ప్రాంతంలోని తండాలన్నీ ఖాళీ అవుతాయి. వృద్ధులు, చిన్నారులు మాత్రమే కనిపిస్తారు. చెరకు నరికేందుకు కుటుంబమంతా వలస వెళ్లడమే ఇందుకు కారణం.

పంటలు నష్టపోవడంతో..

ప్రతి ఏటా నవంబరులో చక్కెర కర్మాగారాలు తెరచుకుంటాయి. చెరకు చేతికొచ్చే సమయం కావడంతో ఈ పనికి నారాయణఖేడ్ ప్రాంతీయులంతా వెళ్తుంటారు. ఇందుకు చక్కెర కర్మాగారాలు, చెరకు తోటల యజమానుల నుంచి అడ్వాన్స్‌గా డబ్బు ముందుగానే తీసుకుంటుంటారు. గిరిజనుల్లో అత్యధికంగా వలసలతో పాటు వ్యవసాయం, కూలీ పనులపైనే ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. ఇటీవలి భారీ వర్షాలతో 40 శాతానికి పైగా పంటలు నష్టపోయాయి. స్థానికంగా పనులు దొరికే అవకాశం అంతంతే. ఈ తరుణంలో బతుకుబండిని నడిపించేందుకు వలస బాట పట్టని పరిస్థితి నెలకొంది. దీంతో వలస వెళ్లే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

విద్యార్థులు సైతం..

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది సుమారు 3 వేల మందికి పైగా తల్లిదండ్రుల వెంట వలస వెళ్లారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,500 మందికి 250 మంది వరకు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 300 మందికి 180 మంది వరకు వలస వెళ్లారు. చెరకు కోత సీజన్ ప్రారంభం నుంచి ముగిసే వరకు నాలుగు నెలల పాటు చదువుకు దూరమయ్యారు. ఈ సారి ఇదే పరిస్థితి ఎదురుకానుంది.

దృష్టిసారిస్తే..

తండాల్లోనే ఉపాధి హామీతో పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసల నివారణ సాధ్యమవుతుంది. ఇందుకు ఇప్పటి నుంచే జిల్లా యంత్రాంగం ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. ఏయే తండాల నుంచి ఎంతమంది వలస వెళ్లే అవకాశం ఉంది, నివారణకు ఏయే పనులు చేపట్టాలి, వెళ్లక తప్పని పరిస్థితులున్న కుటుంబాలు ఎన్ని తదితర విషయాలను సేకరించి కార్యాచరణ రూపొందించాలి. ఇక పిల్లలను వెంట తీసుకెళ్లకుండా చూపాల్సిన చొరవపై దృష్టిసారిస్తే కొంతవరకైనా మార్పు సాధ్యం.

యోగాలో బాలికలు అదుర్స్

న్యూస్‌టుడే, చేర్యాల



యోగాసనాల ప్రదర్శనలో చిన్నారులు

యోగా.. శారీరక, మానసికపర సమన్వయానికి ఏకైక సాధనం. ప్రసుతం పట్టణాల నుంచి పల్లెల వరకు, పిల్లల నుంచి వృద్ధుల వరకు నిత్యం సాధన చేస్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా దీన్ని ప్రాధాన్యాన్ని గుర్తించగా, ఐక్యరాజ్య సమితి జూన్ 21న ప్రత్యేకంగా 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'ను నిర్వహిస్తున్న విషయం విదితమే. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో దీన్ని చేర్చడంతో పిల్లలు నేర్చుకునేందుకు ఆస్కారం ఏర్పడింది. ఈ క్రమంలో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం.సాత్విక, పి.అవంతిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. వచ్చే నెల రెండో వారంలో అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత నిత్యం సాధన చేయించడంతో ఈ స్థాయికి చేరడం విశేషం.

ప్రయోజనాలు తెలియజేసి..:

ఎం.కవిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు



పాఠశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీలతో పాటు యోగా సాధన చేయిస్తున్నాం. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించి పిల్లలను ప్రోత్సహిస్తున్నాం. ఎస్‌జీఎఫ్ యోగా పోటీల్లో పాఠశాల నుంచి ఇద్దరు అమ్మాయిలు జాతీయ స్థాయి ఎంపికవడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలోనూ పతకాలు సాధిస్తారన్న నమ్మకం ఉంది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు.

నిత్యం సాధనతో..



పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు నిత్యం సాధన చేయించారు. ఏ ఆసనం ఎలా వేయాలో నేర్పించారు. ప్రతి రోజూ ఇంట్లోనూ సాధన చేశాం. పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రోత్సహించారు. జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాం. ***ఎం.సాత్విక, 8వ తరగతి***

ఇంటి వద్ద నేర్పిస్తూ..:



రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది. మేము నేర్చుకున్న ఆసనాలను ఇంటి వద్ద మా తల్లిదండ్రులకు, పక్కింటి వారికి సైతం నేర్పిస్తున్నాం. యోగాతో కలిగే ప్రయోజనాలు తెలియడంతో ఆసక్తి పెరిగింది. ***పి.అవంతిక, 7వ తరగతి***

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం: సంజీవరెడ్డి


సరస్వతి పూజలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్: విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని ఖేడ్ ఎమ్మెల్యే డా.పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఖేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 'బ్రైట్ ఛైల్డ్ ఫౌండేషన్' వితరణ చేసిన ఐదు కంప్యూటర్లకు పూజ నిర్వహించి శిక్షణ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆ సంస్థ నిర్వాహకులు కృష్ణ, ట్రస్టీలు మాధవి, ఫణి కుమార్, సలహాదారు మేరియన్ పాలీ, వ్యాపారవేత్త అమూల్యరెడ్డి, మేనేజర్లు కార్తిక్, సూర్య, అభిలాష్ పాల్గొన్నారు. ● నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.కోటితో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే శనివారం సంజీవరెడ్డి పరిశీలించారు. ● అబ్బెంద ఉన్నత పాఠశాలకు ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని ఎమ్మెల్యేకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు.

పీఏసీఎస్‌లో చోరీ

మాచిరెడ్డిపల్లి(కోహీర్): మాచిరెడ్డిపల్లి పీఏసీఎస్‌లో శనివారం తెల్లవారుజామున తలుపులు, తాళం విరగ్గొట్టి కంప్యూటర్‌తోపాటు ఇతర వస్తువులు చోరీ జరిగినట్లు సీఈవో శ్రీకాంత్ పేర్కొన్నారు. సీసీ పుటేజీలు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ పేర్కొన్నారు.

జూద స్థావరంపై దాడి.. అరెస్టు

సిర్గాపూర్, న్యూస్‌టుడే: సిర్గాపూర్ మండలం అంతర్గాం శివారులో శుక్రవారం రాత్రి కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో వెళ్లి దాడిచేసి ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సిర్గాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.5180. నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సంగారెడ్డి అర్బన్: సదాశివపేట మండలం ఆరూర్ గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశ్ (35) జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. ఈనెల 17న ఆస్పత్రిలో చేరిన ఆయన శనివారం ఆయన భార్యతో గొడవపడి చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. పాత బస్టాండ్ ఆవరణలో స్పృహ కోల్పోగా పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తొలుత ఆయనను గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు పరిగణించారు. తదుపరి ఆయన భార్య తనకున్న కనిపించడం లేదని స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. విషయం చెప్పి మృతదేహాన్ని ఆమెకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

తాడ్మన్నూర్ వాసి అదృశ్యం

జోగిపేట: అందోలు మండలంలోని తాడ్మన్నూర్‌కు చెందిన తన భర్త మ్యాతరి లక్ష్మయ్య(55) ఇరవై రోజుల కిందట మెదక్ పట్టణంలో వెళ్లి తిరిగి రాలేదని, ఇన్నాళ్లుగా బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో శనివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పుష్కరం అయినా.. అసంపూర్తే!

చెట్లకిందనే మహిళా సంఘాల సమావేశాలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: కోట్లలో రుణాలు.. వ్యాపార లావాదేవీలు నిర్వహించి ఔరా అనిపించుకుంటున్నారు మహిళా సంఘాల సభ్యులు. వీరు ప్రతి నెల సమావేశాలు నిర్వహించుకుంటారు. ప్రత్యేక భవనం లేకపోవడంతో చెట్ల కింద, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఇబ్బందుల మధ్య సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతిసారి పట్టణ సమాఖ్య సమావేశం పురపాలక సమావేశ మందిరంలో జరుగుతోంది. మహిళా సంఘాల కోసం శాంతి నగర్‌లో నిర్మిస్తున్న భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ భవనం పూర్తిచేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.


సంగారెడ్డిలో అసంపూర్తిగా మహిళా స్వశక్తి భవనం

పట్టణం: సంగారెడ్డి
మహిళా సంఘాలు: 826
సభ్యులు: 10,134

ఏళ్లుగా ఇదేతంతు

సంగారెడ్డి పట్టణంలోని శాంతి నగర్‌లో 'మహిళా స్వశక్తి భవనం' నిర్మాణానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ 2012లో రూ.35 లక్షలు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే జగ్గారెడ్డి పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు స్లాబ్, గోడల వరకు మాత్రమే పనులు పూర్తయ్యాయి. రూ.20 లక్షల వరకు బిల్లులను చెల్లించారు. పనులకు సంబంధించిన యూసీలు సమయానికి ఇవ్వకపోవడంతో ఆరేళ్ల కిందట రూ.15 లక్షలు వెనక్కి వెళ్లాయి. దీంతో పనులు నిలిచిపోయాయి. 'ఈనాడు'లో కథనం రావడంతో రెండేళ్ల కిందట మిగిలిన పనుల పూర్తికి రూ.10 లక్షలు కేటాయించారు. తదుపరి పనులు చేయించాల్సిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు దీనిపై దృష్టిసారించలేదు. దీంతో పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. ఇప్పటికైనా భవనం పనులు పూర్తి చేయించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందుల మధ్యే..

సొంత భవనం లేకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ప్రతినెల నిర్వహించే సమావేశాలు చెట్లు, ప్రభుత్వ భవనాల్లో కొనసాగిస్తున్నారు. పట్టణ మహిళా సమాఖ్య సమావేశం మాత్రం పురపాలక కార్యాలయంలో జరుగుతోంది. భవనం పూర్తి చేసేలా చూడాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించేలా చర్యలు: ప్రసాద్ చౌహాన్, పురపాలక కమిషనర్

మహిళా సంఘ భవనానికి సంబంధించిన పనులు ఎందుకు నిలిచిపోయాయో.. వివరాలు తెప్పించుకుంటా. వీటికి సంబంధించిన నిధులు ఉంటే పెండింగ్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, జోగిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ

? అందోలు గ్రామంలోని వడ్డెర కాలనీలోని రెండు పడకల ఇళ్ల వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుల్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – శ్రీనివాస్, అందోలు.
✓ రెండు పడకల ఇళ్ల వద్ద దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. –తిరుపతి, కమిషనర్, అందోలు– జోగిపేట.
? అందోలు మండలంలోని అన్నాసాగర్ చెరువు కట్టపై పొదలు పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నాయి. – నాగభూషణం, దానంపల్లి.
✓ శుభ్రం చేయిస్తాం. – రవీందర్, డిప్యూటీ ఈఈ, అందోల్.
? సంగారెడ్డిలోని చాణక్యపురి కాలనీ మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. – ఉమ మహేశ్వర్, సంగారెడ్డి.
✓ మూతలు ఏర్పాటు చేయిస్తాం. –సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు.
? ప్రశాంత్ నగర్‌లోని సాయిబాబా దేవాలయం ఏరియాలో వీధి దీపాలు వెలగడం లేదు. – సరిత, సంగారెడ్డి.
✓ సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. –ఇంతియాజ్ అహ్మద్, డీఈఈ.

దాతల సహకారంతో శౌచాలయాలు

జోగిపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని అందోలు ఎంఈవో బండి కృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలం పరిధిలోని డాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఏపీ మెట్ ఇంజినీరింగ్ సంస్థ' రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన శౌచాలయాను ఆ సంస్థ ప్రతినిధి రామకృష్ణ ప్రారంభించిన సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో అక్సాన్‌పల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మల్లేశం, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రమేష్‌గౌడ్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

రుణాల పంపిణీకి ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రతాపరెడ్డి

జహీరాబాద్: రైతులు, మహిళలకు ఎక్కువగా రుణాలు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులకు చెరకు నరికే యంత్రాలు, డ్వాక్రా మహిళలకు రుణాల పంపిణీ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని ఓ వేడుక మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఏపీజీవీబీ సుమంత, గోదావరి ఆగ్రో చక్కెర పరిశ్రమ జీఎం రవీందర్‌రెడ్డి, జహీరాబాద్ మేనేజర్ విక్రమ్‌శివారెడ్డి, చెరకు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనకు పదును


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


విజేతలతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ పట్టణంలోని సంఘమిత్ర 'హైస్కూల్'లో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభాలు, నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన పి.ఇంద్రజ, హెచ్.రిషికారెడ్డి, జోయాజైనాబ్‌లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు.సబితారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.సవితారెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, సంతోష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మృత్యుంజయ యజ్ఞం


హారతి ఇస్తున్న దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజు

ఝరాసంగం: విశ్వశాంతి, ధర్మ రక్షణకు ప్రతినెల పౌర్ణమి తర్వాత మృత్యుంజయ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజు పేర్కొన్నారు. శనివారం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జహీరాబాద్ పరిసర ప్రాంతాలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై నరేష్ వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు సంగ్రామ్ మహరాజ్, వీరేశ్వర శివాచార్య, రాజయ్య స్వామి, సిద్దేశ్వరానంద గిరి స్వామి, విశ్వమానవ ధర్మ ప్రచార సంఘం అధ్యక్షుడు వెంకటేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పుర అధ్యక్షురాలు రోజారాణి

ఐడీఏ బొల్లారం (జిన్నారం): పట్టణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఐడీఏ బొల్లారం పురపాలిక అధ్యక్షురాలు రోజారాణి పేర్కొన్నారు. శనివారం ఐడీఏ బొల్లారం పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీ 7, 8 వార్డుల్లో రూ.50 లక్షలతో నిర్మించే పనులు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, ఏఈ కిష్టయ్య ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులతో న్యాయమూర్తి ధనలక్ష్మి తదితరులు

పుల్కల్, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజంలో జరిగే విషయాలను పరిశీలిస్తూ ఉండాలని, దాంతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.ధనలక్ష్మి పేర్కొన్నారు. చౌటకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇంటివద్ద, విద్యాసంస్థల్లో ఎక్కడైనా బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రజల రక్షణ కోసమే న్యాయ వ్యవస్థ ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉన్నతస్థాయికి చేరుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు మెహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు నెలలుగా ఇదేతంతు!



సంగారెడ్డి నుంచి కంది మీదుగా జంటనగరాలకు మంజీర పైపులైన్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. పైపులైన్ మరమ్మతుల నిమిత్తం దాని పక్కన ఓ దారిని ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సమీపంలోని కిసాన్‌సాగర్ చెరువు నుంచి పారుతున్న అలుగు నీళ్లు మంజీర పైపులైన్ దారి నుంచి వరదలా కొంతదూరం ప్రయాణించి చిమ్నాపూర్ చెరువులో కలుస్తున్నాయి. రోడ్డుపై వరద వల్ల నిత్యం రాకపోకలు సాగించే ఐఐటీ ఉద్యోగులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని మత్తడి నీటిని మళ్లించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కంది

ఈ దారిలో... ఆహ్లాద ప్రయాణం!



సంగారెడ్డి- నర్సాపూర్ రహదారిలో అక్కడక్కడ పొడవాటి చెట్లు ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. ఇవి దారి వెంట వెళ్లిన ప్రయాణికులు, చోదకులు, పాదచారులకు చల్లదనం ఇస్తున్నాయి. ఎండ వేడిమి నుంచి రక్షణగా నిలుస్తున్నాయి. అత్యధికంగా సంగారెడ్డి మండలం ఫసల్‌వాది శివారులోని ఎంఎన్ఆర్ ఆస్పత్రి, హన్మాన్‌నగర్ శివారులో, ఇస్మాయిల్‌ఖాన్‌పేట తదితర ప్రాంతాల్లో చెట్ల నుంచి వచ్చే చల్లని గాలి ఆహ్లాదం పంచుతోంది.

- న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

17 శాతం తేమ తప్పనిసరి

కల్హేర్, న్యూస్‌టుడే: వరి ధాన్యాన్ని ఆరబెట్టి 17 శాతం తేమ వచ్చేలా చూసుకోవాలని, లేని పక్షంలో తాలు గింజలు బయటికి వెళ్లవని నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయశాఖ సహాయసంచాలకులు నూతన్‌కుమార్ సూచించారు. శనివారం నిజాంపేట్ రైతు వేదికలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులు పాటించవలసిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఏవో ఆసియాబేగం, ఏఈవో వంశీక్రిష్ణ, లింగారెడ్డి, సాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవం

రాయికోడ్, న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా పి.గోపాల్, కార్యదర్శిగా నాగరాజు శనివారం రాయికోడ్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుమ్మడిదల భారాస కార్యవర్గం..

గుమ్మడిదల: గుమ్మడిదల మండల భారాస అధ్యక్షుడిగా కొత్తపల్లికి చెందిన లింగయ్యగారి ప్రభాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నరహరి(అన్నారం)లతో కమిటీ ఏర్పాటైంది.

చురుగ్గా సభ్యత్వాల నమోదు

హత్నూర, న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు గ్రామాల్లో చురుగ్గా కొనసాగుతున్నాయని ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కమలాకర్ తెలిపారు. శనివారం బోర్పట్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు సంగారెడ్డిలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కొండాపురం జగన్ కండువా వేశారన్నారు.

దుకాణాలు కేటాయించకుంటే.. ముట్టడి

జహీరాబాద్, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలో జహీరాబాద్ పట్టణంలో రూ.11 కోట్లతో నిర్మించిన సమీకృత భవన సముదాయ దుకాణాలను కేటాయించకుంటే పుర కార్యాలయాన్ని ముట్టడిస్తామని భారాస నాయకులు శనివారం మేనేజర్ గౌస్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, అబ్దుల్లా, బండి మోహన్, యాకూబ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నారాయణఖేడ్: ఖేడ్ పురపాలిక పరిధిలోని పలు వార్డుల్లో శనివారం పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ కార్మికులు, చెత్త సేకరణ ఆటోల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఖేడ్‌కు సహకరించాలని కోరారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మించండి

జిన్నారం: ఐడీఏ బొల్లారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనం నిర్మించాలని కాలనీవాసులు శనివారం కమిషనర్ మంగతాయారును కలిసి వినతిపత్రం అందించారు.

విద్యార్థులకు చెక్కులు అందజేత

హత్నూర: హైదరాబాద్‌లోని 'ఉల్లాస్ స్వచ్ఛంద సంస్థ' ప్రతినిధులు శనివారం మండల పరిధి నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది మంది విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారని హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఎర్రరాయి తరలిస్తున్న వాహనాలు జప్తు

జహీరాబాద్ అర్బన్: హోతి(కె) శివారు గనుల నుంచి ఎర్రరాయిని తరలిస్తున్న రెండు వాహనాలను శనివారం జప్తు చేసినట్లు తహసీల్దార్ రవీందర్ తెలిపారు. ఆర్ఐ యాదిలాల్, సిబ్బంది దత్తు పాల్గొన్నారు.

నేడు అలయ్- బలయ్

వట్‌పల్లి, న్యూస్‌టుడే: ఖైరాతాబాద్ వాసవి ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించనున్న అలయ్- బలయ్ కార్యక్రమానికి వీరశైవ లింగాయత్, లింగ బలిజ సామాజిక వర్గం ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ పిలుపునిచ్చారు. వట్‌పల్లిలో శనివారం శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

నిరసన జయప్రదానికి పిలుపు

జిన్నారం: జిన్నారం అంబేడ్కర్ కూడలిలో ఆదివారం నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భారాస మండల అధ్యక్షుడు రాజేష్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొనాలని కోరారు.

కార్యకర్తలకు అండగా భారాస: మాజీ ఎమ్మెల్యే


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, నారాయణఖేడ్: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నిజాంపేట్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన కార్యకర్త బాలక్రిష్ణ కుటుంబ సభ్యులకు పార్టీ బీమా రూ.2 లక్షలు చెక్కును అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కంగ్టి మండల కేంద్రానికి చెందిన కులకర్ణి శ్రీనివాస్‌రావుకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును భూపాల్‌రెడ్డి అందజేశారు. ● రాంరెడ్డిపేటకు చెందిన పార్వతికి రూ.24 వేలు, మేఘ్యానాయక్‌తండాకు చెందిన శ్రీయాన్ష్‌నాయక్‌కు రూ.9 వేలు, నేనావత్ భీమ్నీ నాయక్‌కు రూ.18 వేల చెక్కులు అందజేశారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

సంగారెడ్డి టౌన్: పెరటి కోళ్ల పెంపకంతో మెరుగైన ఆదాయం ఉంటుందని అదనపు డీఆర్డీవో జంగారెడ్డి పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సంగారెడ్డి మండల సమాఖ్య పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన పెరటి కోళ్ల యూనిట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.